క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో పత్రాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

పార్వతీపురం రూరల్: వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించి తీరాలని, తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చునని పార్వతీపురం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పార్వతీపురం శివారులోని వెంకంపేట గ్రామ సమీపంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. కొరాపుట్ అంతర్రాష్ట్ర రహదారిపై వచ్చీపోయే వాహనాలను ఆపి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలను నడిపేందుకు ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. ఆటోలను, లగేజీ వాహనాలను ఆపి వాటి పత్రాలను పరిశీలించారు. ఆటో డ్రైవర్లు ఏకరూప దుస్తులను ధరించాలని, అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు.

నేడు మండల సమావేశం

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డి.స్వరూపరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈవోపీఆర్డీ దేవకుమార్

మక్కువ: మండలంలోని కోన గ్రామ సచివాలయంలో ఈవోపీఆర్డీ పి.దేవకుమార్ ఆధార్ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గతంలో ఆధార్ కేంద్రం కోన పంచాయతీ పరిధిలో లేనందున, మండల కేంద్రం మక్కువలో ఉన్న ఆధార్ కేంద్రానికి ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. కోన సచివాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం కావడంతో కోన, దబ్బగెడ్డ, డి.శిర్లాం, బంగారువలస, తూరుమామిడి పంచాయతీ ప్రజలకు ఆధార్ సేవలు అందనున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం: మండలంలోని బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈఈ శశిభూషణరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గమనించి సహకరించాలని కోరారు.

బెల్ట్ దుకాణాలపై దాడులు



మద్యం షాపులను తనిఖీ చేస్తున్న సీఐ పద్మావతి

సీతానగరం: మండలంలో నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. నిడగల్లు గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వాహకుల స్థలాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. అంతకు ముందు మద్యం దుకాణాల్లో నిల్వలు, విక్రయ రికార్డులను పరిశీలించారు. అనంతరం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేశారు. సోదాల సమయంలో ఒకరి నుంచి ఎనిమిది మద్యం సీసాలను, మరొక వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చెత్త తొట్టిగా రక్షణ వలయం



ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయంలో వేసిన చెత్త

పార్వతీపురం: పార్వతీపురంలోని ట్రాఫిక్ కూడలి సమీపంలోని బైపాస్ రోడ్ పరిధిలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయాన్ని చెత్త తొట్టిగా స్థానికులు వినియోగిస్తున్నారు. ఈ రహదారి పరిధిలో నిత్యం వందలాది మంది రాకపోకలు చేస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గతంలో నిర్మించిన రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక వ్యాపారులు, గృహస్తులు ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయంలో ఇష్టానుసారంగా చెత్తను పారబోస్తున్నారు. దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఒక్కోసారి చెత్తను కాల్చి తగలబెడుతున్నారు. దీంతో ఒక్కోసారి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం వుంది. అలాగే ప్రమాదం జరిగే అవకాశం వుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కుట్టు.. అంతా కనికట్టు..!



బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రం

- అధికారులకు తెలియకుండా శిక్షణా కేంద్రం ప్రారంభం
- అరకొరగా శిక్షణకు హాజరు

బలిజిపేట: మండల కేంద్రమైన బలిజిపేటలో స్కిల్ డవలప్‌మెంట్‌లో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణ ఒక కనికట్టులా తయారైంది. ఇటువంటి కార్యకలాపాలు స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించడం, అధికారికంగా కేంద్రాన్ని ప్రారంభించడం, నైపుణ్యాలను పెంపొందించేందుకు చేపట్టవలసిన చర్యలు పక్కాగా అమలు చేయడం వంటివి జరగాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వీటిని నిర్వహించడం విమర్శలకు దారి తీస్తుంది. బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఒక ఖాళీ భవనంలో కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ కుట్టు శిక్షణ ఇస్తున్న విషయం స్థానిక ఎంపీడీవో నగేష్‌కు తెలియకపోవడం ఒకింత ఆశ్చర్య పరుస్తుంది. మొదటి విడతగా రెండు బ్యాచ్‌లలో 113మందికి శిక్షణ ఇచ్చేందుకుగాను 20కుట్టు మిషన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎవరు వస్తున్నారో, ఎవరు రాలేదో ఎవరికీ అంతుపట్టడం లేదు. 12వ తేదీన ప్రారంభించినా నేటికీ పూర్తి స్థాయిలో

హాజరు వివరాలు ఇలా...

తేదీ	బ్యాచ్-1 హాజరు	బ్యాచ్-2 హాజరు	రోజుకు
	(ఉదయం 10గంటలు)	(మధ్యాహ్నం 2గంటలు)	హాజరైన వారు
12న	33	27	60
13న	24	29	53
14న	34	32	66
15న	29	30	59

హాజరు కనిపించడం లేదు. కుట్టు శిక్షణను శ్రీ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేటు ఆర్గనైజేషన్‌కు అప్పగించినా వారు కనీసం స్థానిక అధికారులను కలవడం గాని, అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించకుండానే శిక్షణ నిర్వహిస్తున్నారు.

339 దరఖాస్తులు

స్కిల్ డవలప్‌మెంట్‌లో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ మహిళలకు కుట్టు శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానించారు. 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. 90రోజుల శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో 75శాతం హాజరు ఉంటే అటువంటి వారికి శిక్షణ పూర్తయిన తరువాత కుట్టుమిషను ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. దీంతో మండలంలో 339 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి విడతలో 113మందికి శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. శిక్షణా సమయంలో ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు ఒక బ్యాచ్‌గా విభజించారు. అందుకు సంబంధించి బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఉండే నూతన భవనాన్ని ప్రతిపాదించారు. దీనిని ఇవ్వవచ్చా.. లేదా.. అనేది అధికారులకే తెలియాలి. శిక్షణ ఇచ్చేందుకు ఇద్దరు మహిళా బోధకులను నియమించారు. ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా.. స్థానిక ఎంపీడీవోకు కనీసం సమాచారం లేదు. ఇప్పుడు శిక్షణకు అర్హులైన 113మంది మినహా మిగిలిన వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా ఉంది.

నాకు తెలియదు..

పూర్తి స్థాయి పర్యవేక్షణ బాధ్యతలు మావే అయినా కుట్టు శిక్షణ ప్రారంభమైనట్టు ఎటువంటి సమాచారం నాకు తెలియదు. ఎప్పుడు ప్రారంభమైందో తెలియదు. దీనికి సంబంధించిన ప్రైవేటు ఆర్గనైజేషన్ వారు వచ్చి కలవలేదు. అక్కడకు కుట్టు మిషన్లు ఎన్ని వచ్చాయో కూడా తెలియదు. ఇంతవరకు పర్యవేక్షణ లేదు.

– నగేష్, ఎంపీడీవో, బలిజిపేట

అరకొరగా హాజరు

ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించినా నేటికి పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. మొదటి విడతలో 113 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. అందుకు శిక్షణా కేంద్రానికి 20 కుట్టుమిషన్లు మాత్రమే వచ్చాయి.

● అంగన్‌వాడీల సమావేశం ఇలా..



బలిజిపేట అంగన్‌వాడీ ప్రాజెక్టు సమావేశంలో కార్యకర్తలు కూర్చునేందుకు సరైన సదుపాయం లేక ఇలా వరండాలో అందరూ విడిచి పెట్టిన చెప్పుల మధ్యలో కూర్చున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని బలిజిపేట, సీతానగరం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో సీడీపీవో సులేఖ కేంద్రాల నిర్వహణ, యాప్‌ల వినియోగం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశానికి 178 మంది హాజరు కాగా కనీసం కూర్చునేందుకు కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

– బలిజిపేట

● పొంచి ఉన్న ప్రమాదం



పార్వతీపురం మండలంలోని చినబొండపల్లి గ్రామంలో కైకాలవీధి సమీపంలో సీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి రక్షణ వలయం, గోడ లేకుండా ఏర్పాటు చేయడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలు అటుగా మేతకు వెళ్లేటప్పుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని కాపలాదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ వలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పార్వతీపురం రూరల్

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా...



బలిజిపేట: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కరపత్రాలు విడుదల చేస్తున్న అంగన్వాడీ టీచర్లు

బలిజిపేట: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపడుతున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్లు కరపత్రాలను గురువారం విడుదల చేశారు. బలిజిపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను ప్రదర్శించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు దాలమ్మ, కార్యదర్శి సత్యవతి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు కోరారు. మండలంలోని బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం గ్రామాల్లో గురువారం సమ్మె సన్నాహక ప్రచారం చేపట్టారు. ఆయన వెంట సంఘం నాయకులు జి.వెంకటరమణ, ఎం.నాగరాజు, వై.రామారావు, ఆర్.రాము, చిన్నారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

పార్వతీపురం:

అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్లకు రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లకు రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాలు వర్తించేటట్టు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి ఎలాంటి సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, ఇంటి స్థలాల మంజూరు వంటి పథకాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, చేర్పులు, మార్పుల కోసం సచివాలయాలకు వెళ్లే వారికి పనులు జరగకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా బాలింతలు, మహిళలు నానా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రాజశేఖర్ తదితరులున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పాలకొండ:

మహిళలు ఆర్థికంగా ముందంజ వేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. నగర పంచాయతీ పరిధిలో మహిళలకు 90రోజుల పాటు ఇవ్వనున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకుని కుట్టు మిషన్లు పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ఈ కుట్టుమిషన్ల ద్వారా ఇంటి నుంచి పనిచేసుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

● తాగునీటి కష్టాలు..



పార్వతీపురం పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఇచ్చే హామీలు నెరవేరడం లేదు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నాలుగు రోజులకొకసారి తాగునీటిని కుళాయిల ద్వారా విడిచిపెడుతున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గూడ్స్ షెడ్ రోడ్డులో గురువారం ఉదయం ట్యాంకర్ వద్ద నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలను ఈ చిత్రంలో చూడొచ్చు.

– పార్వతీపురం టౌన్

చినుకు పడితే చిత్తడే...

మార్కొండపుట్టి - మర్రివానివలస రహదారి దుస్థితి




కె.పెద్దవలస గ్రామం వద్ద రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్న వాహనదారులు



మక్కువ మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధి మర్రివానివలస, కె.పెద్దవలస గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. చినుకు పడితే చాలు చిత్తడిగా మారి ప్రమాదకరంగా తయారైంది. రహదారి మధ్యలో గోతులు ఏర్పడడంతో వర్షపు నీరు నిల్వ ఉండి గోతులు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో గతంలో స్థానికులు మట్టి వేసి కప్పేయడంతో బురదమయమైంది. వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– మక్కువ

● వంతెన పనులు పూర్తయ్యేదెప్పుడో...



సాలూరు మండలంలోని పారన్నవలస పంచాయతీ పెదపారన్నవలస గ్రామానికి ఓ వైపు వేగావతి నది... మరోవైపు కూరగెడ్డ దాటి చేరుకోవాల్సిన పరిస్థితి. అయితే వర్షాకాలంలో ఈ గ్రామాల ప్రజల ఊరు దాటి బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కూరగెడ్డపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.74 కోట్లు మంజూరు చేసింది. పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇంతలో ప్రభుత్వం మారిపోయింది. ప్రస్తుతం గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి గ్రామాలకు రహదారులు వేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో తమ గ్రామానికి రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మాణ పనులు కొనసాగించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సాలూరు రూరల్

అష్టకష్టాల నడుమ అంతిమ సంస్కారాలు



పుట్టూరు గ్రామ సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలు



ఎమ్మార్‌నగరంలో నాయుడు చెరువు గట్టుపై అంతిమ సంస్కారాలు

- శ్మశాన వాటికల్లో కరువైన మౌలిక సదుపాయాలు
- సరైన దారి లేక అవస్థలు
- పలు గ్రామాల్లో కిలోమీటర్ల దూరాన శ్మశాన వాటికలు

పార్వతీపురం రూరల్: తమ ఆత్మీయులు, బంధువులు మరణించారనే విషయాన్ని మనసులో పెట్టుకొని హృదయ వేదనతో మృతదేహాన్ని శ్మశాన వాటికలకు తీసుకెళ్తుంటారు. అయితే అక్కడి శ్మశాన వాటికల దుస్థితి చూసి మరింత ఆవేదన చెందుతున్నారు. సరిగ్గా నడిచే దారి లేక, స్థలాలు లేక, చెరువు గట్టులు, కాలువల్లో నడుచుకుంటూ తమ గ్రామాల్లో నిర్దేశించిన శ్మశాన వాటికలకు వ్యయ ప్రయాసాలతో కిలోమీటర్ల మేర దూరం నడిచి చేరుకుంటున్నారు. అక్కడ శ్మశానాల్లో నిలువ నీడ లేక కనీస స్థాయిలో మౌలిక సదుపాయాల్లేక మరింత ఆవేదనకు గురవుతున్నారు. చాలా చోట్ల వ్యవసాయ భూములకు సమీపంలో ఉండడంతో సరిహద్దులు పోలికలు లేక ఖననం చేసిన చోటే మళ్లీ మళ్లీ అంత్యక్రియలు చేస్తున్న హృదయ విదారక ఘటనలు అనేక గ్రామాల్లో చోటు చేసుకుంటున్నాయి.

కల్పించాల్సిన సదుపాయాలు

కనీస స్థాయిలో శ్మశాన వాటికలలో వేచి వుండేందుకు ఒక గది, స్నానాలు ఆచరించేందుకు నీటి బోరు, నీటి తొట్టె, దహనపు గద్దె, ఆయా గ్రామాల నుంచి శ్మశాన వాటికకు సురక్షితమైన రహదారి, విద్యుత్ సౌకర్యం, చుట్టూ ప్రహరీ, సంబంధించిన గ్రామ జనాభానుసారం స్థల కేటాయింపు వంటి కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అయితే గ్రామాల్లోని శ్మశాన వాటికలు తుప్పలు, డొంకలతో దర్శనమిస్తూ ఎలాంటి మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో నదులను దాటి శ్మశానాలు ఉండడంతో వర్షాకాలంలో పీకల్లోతు మునిగి మృతదేహంతో నదిని దాటాల్సిన దుస్థితి నెలకొంటుంది.



విషాదంలో కూడా..

మా ప్రాంతంలో కులాల ప్రాతిపదికన దాదాపు ఐదు శ్మశాన వాటికలు ఉన్నాయి. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి దహన సంస్కారాల నిమిత్తం శ్మశాన వాటికలకు వెళ్లేందుకు సరైన దారి కూడా లేదు. కిలోమీటర్ల మేర తుప్పలు, డొంకలను తప్పించుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. శ్మశాన వాటికల్లో వేచి వుండేందుకు షెడ్డులుగాని, స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యంగాని లేవు. ఆత్మీయులు, బంధువులు మృతి చెందారన్న విషాదంలో కూడా అంతిమ సంస్కారాలు చేసేందుకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మరింత కలత చెందాల్సి వస్తుంది.

– ఉరిటి అప్పలనాయుడు, ఎమ్మార్‌నగరం, పార్వతీపురం మండలం



త్వరలో నిధుల కేటాయింపు

ప్రభుత్వం నుంచి జూన్ నెలలో శ్మశానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు రానున్నాయి. మాకు వచ్చిన ప్రతిపాదనల మేరకు దృష్టి సారించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శ్మశాన వాటికల్లో కొన్ని సౌకర్యాల ఏర్పాటుకు నిధులు వచ్చిన ప్రతిపాదనల మేరకు మంజూరు చేస్తాం.

– కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా